సాక్షి అనంతపురం

బుధవారం, 22, నవంబర్, 2023



టీబీ డ్యాంలో తగ్గిన నీరు

తుంగభద్ర జలాశయంలో నీటిమట్టం 20.185 టీఎంసీలకు పడిపోయింది. ఇన్‌ఫ్లో 298 క్యూసెక్కులు నమోదైంది.



జిల్లాకు వర్ష సూచన

జిల్లాలో రానున్న మూడు రోజుల్లో వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు తెలిపారు.

గరిష్టం/కనిష్టం

33.4°/20.6°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వాతావరణం మేఘావృతమైంది. ఉదయం చలి పెరిగింది. ఈశాన్యం దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

ప్రయాణికుల భద్రతే లక్ష్యం



మల్కాపురం రైల్వేస్టేషన్‌లో సేఫ్టీ కమిషనర్‌తో మాట్లాడుతున్న డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్

గుంతకల్లు: ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని దక్షిణ మధ్య రైల్వే సేఫ్టీ కమిషనర్ ప్రణ్‌జీవ్ సక్సేనా ఆదేశించారు. మంగళవారం ఆయన డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్‌తో కలిసి గుంతకల్లు డివిజన్‌లోని మల్కాపురం–డోన్ సెక్షన్‌లో నూతనంగా నిర్మించిన రైలు మార్గంలో తనిఖీలు నిర్వహించారు. ఈ మార్గంలో ప్రత్యేక రైలులో ప్రయాణిస్తూ స్పీడ్ టెస్ట్ పరిశీలించారు. మల్కాపురం రైల్వే స్టేషన్‌లోని సిగ్నలింగ్ క్యాబిన్, స్విచ్ ప్యానళ్లు, ఇంటర్‌లాకింగ్ సిగ్నల్ క్యాబిన్‌లోని సామగ్రిని పరిశీలించారు. రైల్వేలైన్లు పటిష్టంగా ఉండాలని, లోపాలు ఉంటే సరిద్దాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా రైళ్ల రాకపోకల నియంత్రణలో సిగ్నలింగ్ వ్యవస్థ ప్రధాన భూమిక పోషిస్తుందని, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రమాద నివారణకు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సేఫ్టీ బ్రాంచ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య ఎంఏ ఫలితాల విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ఎస్కేయూ వీసీ రామకృష్ణారెడ్డి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం దూర విద్య ఎంఏ నాలుగో సెమిస్టర్ ఫలితాలను వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి మంగళవారం విడుదల చేశారు. ఎంఏ హిస్టరీలో ఇద్దరు, పొలిటికల్ సైన్సెస్‌లో 12, ఎకనామిక్స్‌లో 10, ఇంగ్లిష్‌లో 43, సోషియాలజీలో 21, రూరల్ డెవలప్‌మెంట్‌లో 8 మంది ఉత్తీర్ణులయ్యారు. రీవాల్యుయేషన్ చేయించుకోదలచిన వారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చెల్లించాల్సి ఉంటుంది. రీవాల్యుయేషన్ దరఖాస్తుకు డిసెంబర్ 11 చివరి తేదీగా నిర్దేశించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ, దూరవిద్య డైరెక్టర్ ప్రొఫెసర్ మునినారాయణప్ప, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కె.శ్రీరాములు నాయక్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.ఉమాపతి పాల్గొన్నారు.

నేడు బొమ్మనహాళ్‌లో 'జగనన్నకు చెబుదాం'

బొమ్మనహాళ్: 'జగనన్నకు చెబుదాం' మండల స్థాయి కార్యక్రమం బుధవారం బొమ్మనహాళ్‌లో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ షకీలా బేగం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి 'జగనన్నకు చెబుదాం', 'స్పందన' ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ గౌతమితో పాటు సంబంధిత అధికారులు పాల్గొంటారన్నారు.

అనంతపురం స్పోర్ట్స్ అకాడమీకి ప్రత్యేక అవార్డు



అవార్డు అందుకుంటున్న ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ పి. సాయికృష్ణ

అనంతపురం: ఆర్డీటీ అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ (ఏఎస్ఏ)కి ఆసియా ఫుట్‌బాల్ కన్ఫెడరేషన్ క్షేత్రస్థాయి ప్రత్యేక అవార్డు–2023 దక్కింది. మలేషియాలోని కౌలాలంపూర్‌లో నవంబర్ 21 నుంచి 23 వరకు జరగనున్న మూడవ ఆసియా ఫుట్‌బాల్ కన్ఫెడరేషన్‌లో ఈ అవార్డును అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ డైరెక్టర్ పి.సాయికృష్ణ అందుకున్నారు. 2000 సంవత్సరంలో ప్రారంభమైన అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ క్షేత్రస్థాయిలో ఫుట్‌బాల్ అభివృద్ధిలో విశేష కృషి చేసింది. ఈ నేపథ్యంలో ఉత్తమ క్షేత్రస్థాయి ప్రాజెక్ట్‌గా ఈ గుర్తింపు దక్కింది. ఈ అవార్డును ఆసియా ఫుట్‌బాల్ కన్ఫెడరేషన్, ఆలిండియా ఫుట్‌బాల్ అసోసియేషన్ అందజేసింది. ఫుట్‌బాల్ పట్ల ఎక్కువ మంది పిల్లలను ఆకర్షించేలా కృషి చేస్తామని డైరెక్టర్ సాయికృష్ణ తెలిపారు. గ్రామీణ వర్గాల్లో సానుకూల మార్పును తీసుకువస్తూ, క్రీడల సామర్థ్యాన్ని ప్రభావితం చేసే లక్ష్యంతో ప్రత్యేక శిక్షణ కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే 20,040 మందికి ఫుట్‌బాల్ క్రీడలో శిక్షణ ఇచ్చామన్నారు.

స్నాతకోత్సవానికి వేళాయె


- నేడు సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 42వ స్నాతకోత్సవం
- సాయి హీరా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా వేడుకలు
- ముఖ్య అతిథిగా పాల్గొననున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- హాజరుకానున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్
- 14 మందికి డాక్టరేట్లు, 21 మందికి బంగారు పతకాలు



29వ స్నాతకోత్సవంలో పాల్గొన్న అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్, గవర్నర్ నరసింహన్‌తో సత్యసాయి (ఫైల్)



సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ పరిపాలన భవనం



విద్య మానవుల్లోని అజ్ఞానాంధకారాన్ని పారదోలి విజ్ఞానం వైపు అడుగులు వేయిస్తూ వివేకవంతునిగా తీర్చిదిద్దుతుంది. వివేకవంతుడు విలువలతో కూడిన సమసమాజ స్థాపనతో లోకకల్యాణానికి పాటుపడగలడు.

–సత్యసాయి బాబా

ప్రశాంతి నిలయం: స్నాతకోత్సవ సంబరానికి సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ ముస్తాబైంది. బుధవారం ప్రశాంతి నిలయంలోని సాయి హీరా ఇంటర్నేషన్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే 42వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారు. ఇందుకోసం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. స్నాతకోత్సవంలో రాష్ట్రపతి చేతుల మీదుగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన 14 మంది పరిశోధనా విద్యార్థులకు డాక్టరేట్లు, 21 మందికి గోల్డ్ మెడళ్లు, 560 మంది విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా ద్రౌపది ముర్ము విద్యార్థులనుద్దేశించి ప్రసంగించనున్నారు.

విలువల నిలయం

సత్యసాయిబాబా తాను బోధించిన మానవతా విలువలు, ఆధ్యాత్మికత కలగలిపి ఆధునిక విజ్ఞానాన్ని అందించేందుకు సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ పేరుతో 1981లో చక్కటి విద్యా వ్యవస్థను నెలకొల్పారు. అనంతర కాలంలో సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీగా రూపాంతరం చెందింది. సత్యసాయి భారతీయ విద్యావిధానంలో అనాదిగా అమలవుతున్న గురుకుల విద్యా విధానానికి మెరుగులుదిద్దుతూ, నేటి సమాజ అవసరాల మేరకు మార్పులు చేసి నూతన గురుకుల విధానాన్ని అమలయ్యేలా విద్యా వ్యవస్థలను రూపొందించారు. మానవతా విలువలు, ఆధ్యాత్మికత, శాస్త్ర సాంకేతిక అంశాలతో కూడిన సమ్మిళిత విద్యను బోధిస్తూ అత్యద్భుతమైన ఫలితాలతో ప్రపంచంలోనే మేటి విద్యాసంస్థల సరసన నిలిపారు. విద్య వ్యాపారమైన నేటి రోజుల్లోనూ సత్యసాయి విద్యాసంస్థల్లో కేజీ నుంచి పీజీ వరకు నయాపైసా వసూలు చేయకుండా ప్రమాణాలతో కూడిన ఆదర్శ విద్యను అందిస్తున్నారు. అందువల్లే సత్యసాయి విద్యాసంస్థలు విలువల నిలయాలుగా వేనోళ్ల కీర్తింపబడుతున్నాయి. సత్యసాయి 98వ జయంత్యుత్సవాల్లో భాగంగా బుధవారం సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్(సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ) 42వ స్నాతకోత్సవం ప్రశాంతి నిలయంలోని సాయి హీరా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా అంగరంగవైభవంగా నిర్వహించనున్నారు.

పటిష్టమైన పాలనా వ్యవస్థ

సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ అనుబంధంగా సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ కొనసాగుతోంది. పబ్లిక్ చారిటబుల్ ట్రస్ట్‌గా ఫౌండర్ చాన్సలర్ హోదాలో సత్యసాయి కొనసాగుతుండగా, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, ట్రస్ట్ సభ్యుడు ఎస్.ఎస్ నాగానంద, యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ మాజీ వైస్ ఛాన్సలర్ త్యాగరాజన్, చెన్నైకి చెందిన మధుమేహ వ్యాధి నిపుణుడు డాక్టర్.వి మోహన్, సత్యసాయి విద్యాసంస్థల మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కేబీర్ వర్మ సభ్యులుగా ఉన్నారు. వీరితోపాటు మరో 13 మందితో కూడిన బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్, ఆరుగురు సభ్యులతో కూడిన అకడమిక్ కౌన్సిల్ సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ పరిపాలన, అకడమిక్ వ్యవహారాలు చూస్తుంది.

రెండు రాష్ట్రాలు ...నాలుగు క్యాంపస్‌లు

పుట్టపర్తిలోని యూనివర్సిటీ పరిపాలనా భవనం నుంచి పాలన కొనసాగుతున్నా, కోర్సులు మాత్రం ఏపీ, కర్ణాటక రాష్ట్రంలో నెలకొల్పిన నాలుగు క్యాంపస్‌ల ద్వారా నిర్వహిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని ముద్దెనహళ్లి, బృందావన్ క్యాంపస్‌లు, ఆంధ్రప్రదేశ్‌లో పుట్టపర్తి ప్రశాంతి నిలయం క్యాంపస్‌తో పాటు, అనంతపురంలోని మహిళా క్యాంపస్‌ల ద్వారా విద్యాసంస్థలు కొనసాగుతున్నాయి. చక్కటి క్రీడా మైదానాలు, లేబొరేటరీలు, మల్టీమీడియా సెంటర్లు, క్రీడా సౌకర్యాలతో విద్యార్థులకు సౌకర్యవంతంగా క్యాంపస్‌లను తీర్చిదిద్దారు.

అనంతపురం క్యాంపస్

మహిళా విద్యను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో సత్యసాయి 1968లోనే అనంతపురంలో 115 ఎకరాల విస్తీర్ణంలో మహిళా క్యాంపస్‌ను నెలకొల్పారు. క్యాంపస్‌లో మహిళలకు మాత్రమే ప్రవేశాలు కల్పించారు. ఈ క్యాంపస్ ద్వారా మహిళలకు అండర్ గ్రాడ్యుయేషన్‌లో బీఏ, బీఎస్సీ, బీకాం, పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ఎంఏ, ఎంఎస్సీ, ప్రొఫెషనల్స్ బీఈడీ, ఎంబీఏ, పరిశోధనలో పీహెచ్‌డీ కోర్సులు నిర్వహిస్తున్నారు.

రామచంద్ర యాదవ్ ఓ పొలిటికల్ జోకర్

- యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్ ధ్వజం



మాట్లాడుతున్న హరీష్ కుమార్ యాదవ్

అనంతపురం కార్పొరేషన్: భారత చైతన్య యువజన పార్టీ వ్యవస్థాపకుడు రామచంద్ర యాదవ్ ఓ పొలిటికల్ జోకర్ అని యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్ విమర్శించారు. మంగళవారం ఆయన అనంతపురంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మద్యం, గ్రానైట్ తదితర వాటిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.1,65,000 కోట్లు వెనకేసుకున్నారని రామచంద్ర యాదవ్ ఆరోపిస్తూ..పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. రూ.వంద కోట్లు దాటిన కాంట్రాక్ట్ పనులు జ్యుడీషియరీ రివ్యూకు వెళతాయన్న ఆలోచన కూడా రామచంద్ర యాదవ్‌కు లేదన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డిని విమర్శించే స్థాయి అతనికి లేదన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో జనసేన తరఫున పోటీ చేసిన రామచంద్ర యాదవ్‌కు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వచ్చిన మెజారిటీలో సగం ఓట్లు కూడా రాలేదని గుర్తు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో నాలుగున్నరేళ్లలో ఎన్నడూ లేని సంక్షేమం, అభివృద్ధి జరిగిందన్నారు. అవినీతి సొమ్ముతో పార్టీ పెట్టిన రామచంద్ర యాదవ్ పెత్తందారుల పార్టీల వైపు వకాల్తా పుచ్చుకున్నట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బీసీలకు చేసిన సామాజిక న్యాయం కన్పించలేదా అని ప్రశ్నించారు. దేశంలోనే ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా బడుగులకు పదవులు, నామినేటెడ్ పోస్టులు, కాంట్రాక్టు పనుల్లో భాగస్వామ్యం కల్పించి గొప్ప సామాజిక న్యాయం చేశారని కొనియాడారు.

ముగ్గురు దొంగల అరెస్ట్

- వీరిలో ఒకరు అంతర్‌రాష్ట్ర దొంగ
- 23.5 తులాల బంగారు నగలు స్వాధీనం





దొంగల అరెస్టు వివరాలు మీడియాకు వెల్లడిస్తున్న ఎస్పీ అన్బురాజన్, స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

అనంతపురం క్రైం : తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి దొంగనాలకు పాల్పడే ముగ్గురు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఒకరు అంతర్ రాష్ట్ర దొంగ ఉన్నారు. వీరి నుంచి 23.5 తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ అన్బురాజన్ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో మీడియాకు వెల్లడించారు. అరెస్టయిన వారిలో కళ్యాణదుర్గానికి చెందిన పీట్ల గంగాధర్, నార్పల మండల కేంద్రానికి చెందిన బస్సే సుభాష్, గుంతకల్లు పట్టణంలోని రాజేంద్రనగర్‌కు చెందిన కంసలి పవన్ బహదూర్ అలియాస్ బీర్ బహదూర్ ఉన్నారు.

అంతర్‌రాష్ట్ర దొంగపై 50కి పైగా కేసులు

జిల్లా పోలీసు రికార్డుల్లో పీట్ల గంగాధర్ పాత నేరస్తుడు. ఇతను ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో 50కి పైగా చోరీ కేసుల్లో నిందితుడు. ఈ ఏడాది మార్చి నుంచి అనంతపురం నగరంలోని వివేకానందనగర్, రూరల్ పరిధిలోని సిండికేట్ నగర్‌లో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి పగటి పూట దొంగతనాలకు పాల్పడ్డాడు. తెలంగాణ రాష్ట్రం నారాయణపేట జిల్లా పోలీసులు ఇతనిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపగా ఇటీవలే జైలు నుంచి బయటికొచ్చాడు. డీఎస్పీ బి.వి శివారెడ్డి పర్యవేక్షణలో అనంతపురం రూరల్ ఎస్ఐ ప్రవీణ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ ఒ.కిష్టప్ప, కానిస్టేబుళ్లు రాజు, పాండవ బృందంగా ఏర్పడి పీట్ల గంగాధర్‌ను సోమవారం ఉదయం అరెస్టు చేశారు. ఇతని నుంచి ఆరు తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

దొంగను చేసిన వ్యసనాలు

బస్సే సుభాష్ వ్యసనాలకు బానిసై వాటిని తీర్చుకునేందుకు దొంగగా మారాడు. ఇతనిపై వివిధ స్టేషన్లలో పది కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఆగస్టులో బుక్కరాయసముద్రం మండలం కొత్తపల్లిలో చోరీ చేశాడు. అనంతరం తాడిపత్రి రూరల్ మండలం చిన్నపొడమలలోని ఓ ఇంట్లో చోరీకి తెగబడ్డాడు. గత సెప్టెంబర్‌లో యల్లనూరు మండల కేంద్రంతో పాటు పుట్లూరు మండలం గోపరాజుపల్లిలో తాళం వేసిన ఇళ్లల్లో చోరీలు చేశాడు. పుట్లూరు ఎస్ఐ దిలీప్‌కుమార్, హెడ్ కానిస్టేబుళ్లు ఇ.ప్రసాద్, ఒ.చంద్ర శేఖర్ కానిస్టేబుళ్లు అనిల్, దేవులానాయక్, గౌస్, కిషోర్‌కుమార్, శివశంకర్, నరేశ్ బృందంగా ఏర్పడి సుభాష్‌ను సోమవారం అరెస్టు చేశారు. ఇతని నుంచి 11 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

పోలీసులకు చిక్కిన పాత నేరస్తుడు

గుంతకల్లులోని రాజేంద్రనగర్‌కు చెందిన కంసలి పవన్ బహదూర్ అలియాస్ బీర్ బహదూర్ పాత నేరస్తుడు. ఇతనిపై మొత్తం మూడు కేసులు నమోదయ్యాయి. గుంతకల్లు రైల్వే క్వార్టర్స్‌లోని ఓ ఇంట్లో ఈ ఏడాది జూలై చివరి వారంలో సుమారు 6.5 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఈ కేసును ఛేదించాలని ఆదేశించారు. డీఎస్పీ యు.నరసింగప్ప పర్యవేక్షణలో గుంతకల్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పడి నిఘా ఉంచారు. పక్కా సమాచారంతో సోమవారం హనుమాన్ సర్కిల్‌లో ఈ చోరీ కేసులో ప్రధాన నిందితుడైన కంసలి పవన్ బహదూర్ అలియాస్ బీర్ బహదూర్‌ను అరెస్టు చేశారు. ఇతను మరొక పాత నేరస్తుడైన బండారు విజయకుమార్‌తో కలిసి చోరీకి పాల్పడినట్లు విచారణలో అంగీకరించాడు. ఈ కేసులో 6.5 తులాల బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. రెండో నిందితుడైన విజయకుమార్‌ను పోలీసులు ఇదివరకే అరెస్టు చేశారు. దొంగలను చాకచక్యంగా అరెస్టు చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అన్బురాజన్ మంగళవారం అభినందించి, నగదు రివార్డులు అందజేశారు.

తెలుగు భాషాభివృద్ధికి కృషి

- పాలనా వ్యవహారాల్లో మాతృభాష అమలు కావాలి
- అధికారభాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు



విజయబాబు నుంచి సత్కారం అందుకున్న సాహితీవేత్తలు

అనంతపురం అర్బన్: తెలుగు భాషాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షుడు పి.వి జయబాబు అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు భాష అమలుపై ఆయన మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎం.గౌతమితో కలిసి అధికారులతో సమీక్షించారు. విజయబాబు మాట్లాడుతూ ఆంగ్ల భాషకు ముఖ్యమంత్రి ప్రాధాన్యత ఇస్తున్నారంటూ కొందరు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. తెలుగుభాషను పటిష్టంగా అమలు చేసేందుకు ఆయన ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో పేదవర్గాల భవిష్యత్తు కోసం ఆంగ్ల మాధ్యమంలో బోధనకు శ్రీకారం చుట్టారన్నారు. పాఠ్యపుస్తకాల్లో ఒకవైపు తెలుగు, మరో వైపు ఆంగ్లంలో పాఠ్యాంశాలు అందుబాటులో ఉంచారన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న ఈ విధానంపై ఇతర రాష్ట్రాలవారు వచ్చి అధ్యయనం చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరిలోనూ భాషాభిమానం, భాషను కాపాడుకోవాలనే తపన ఉంటుందన్నారు. అయితే అమలులో కొన్ని ఇబ్బందులు ఎదురవుతుంటాయన్నారు. వాటిని అధిగమించి పాలనా వ్యవహారాల్లో తెలుగుభాష అమలు లక్ష్యంగా అధికారులు పనిచేయాలని పిలుపునిచ్చారు. పాలనాపరంగా తీసుకునే నిర్ణయాలు, ఉత్తర్వులు ప్రజలకు చేరాలంటే అవన్నీ మాతృభాషలో ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ గాయత్రీదేవి, ఆర్డీఓ గ్రంధి వెంకటేష్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డిసెంబర్‌లో సాహితీ సదస్సు

అనంతపురం టవర్‌క్లాక్ / కల్చరల్: జిల్లా చరిత్ర, సాహిత్యం ప్రతిబింబించే విధంగా డిసెంబర్ మొదటి వారంలో 'అనంత తెలుగు భాషా వికాసం' పేరుతో సాహితీ సదస్సు నిర్వహించనున్నట్లు తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షుడు విజయబాబు తెలిపారు. అనంతపురం పర్యటనకు వచ్చిన ఆయనను స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో కవులు, రచయితలతో సమావేశమై భాషాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు, సూచనలు తీసుకున్నారు. తెలుగు భాషాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. అనంతపురంలో నిర్వహించే సాహితీ సదస్సుకు విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు. అనంతరం జిల్లాలో సాహిత్య వికాసానికి కృషి చేస్తున్న ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, డాక్టర్ శాంతినారాయణ, రాజారాం, డాక్టర్ రమేష్ నారాయణ, రియాజుద్దీన్, గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, శ్యామసుందరశాస్త్రి, గిరిధరరాయ్‌తో పాటు సాహిత్య సమన్వయం చేస్తున్న టూరిజం శాఖ అధికారి నాగేశ్వరరెడ్డిని విజయబాబు అభినందించి, ఆత్మీయ సత్కారం చేశారు.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



ద్విచక్ర వాహనాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం అర్బన్: మత్స్యకారుల ఆర్థికాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రపంచ మత్స్య దినోత్సవం కార్యక్రమానికి కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మత్స్యకార కుటుంబాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. చేపల పెంపకం కోసం అవసరమైన ప్రోత్సాహం అందిస్తామన్నారు. రైతులు ముందుకు వస్తే మరిన్ని మినీ ఫిష్ అవుట్‌లెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. మత్స్యరంగం అభివృద్ధికి జిల్లా యంత్రాంగం తరఫున సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. ప్రస్తుతం చేపలు, రొయ్యలకు మంచి డిమాండ్ ఉందన్నారు. ఇందుకు అనుగుణంగా ఉత్పత్తి చేయాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ పథకాలు సద్వినియోగం చేసుకుని మత్స్యకార కుటుంబాలు ఆర్థికాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం రూ.75 వేలు విలువ చేసే ద్విచక్రవాహనం– ఐస్‌బాక్స్‌ను 40 శాతం సబ్సిడీతో ఆరుగురు లబ్ధిదారులకు కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్ పంపిణీ చేశారు. చిన్నతరహా చేపల మార్కెట్ నిర్వహిస్తున్న లబ్ధిదారులను సన్మానించి మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో మత్స్య శాఖ ఎఫ్‌డీఓలు ఆసిఫ్, లక్ష్మీనారాయణ, ఫక్కీరప్ప, పెద్దబాబునాయుడు, సిబ్బంది షెహిన్‌ఖాన్, మత్స్యకార సహకార సంఘాల మాజీ అధ్యక్షుడు అంకె పోతన్న, బాల నరసింహులు, గోవర్ధన్, నాయకులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం జగనన్నతోనే సాధ్యం



కైరేవులో వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

శెట్టూరు: మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం సీఎం వైఎస్ జగనన్నతోనే సాధ్యమైందని మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ అన్నారు. శెట్టూరు మండలం కైరేవులో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్‌బీకే భవనం, వెల్‌నెస్ సెంటర్‌ను మంగళవారం ఆమె ప్రారంభించారు. ప్రతి గది నిర్మాణాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గతంలో ప్రభుత్వ సేవల కోసం గ్రామీణులు సుదూరంగా ఉన్న మండల కేంద్రాలకు వ్యయప్రయాసాలకోర్చి వెళ్లేవారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో ఇంటి వద్దనే ప్రభుత్వ సేవలను సీఎం వైఎస్ జగన్ చేరువ చేశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో విత్తన పంపిణీ అస్తవ్యస్తంగా ఉండేదన్నారు. ప్రస్తుతం ఆర్‌బీకేల ద్వారా విత్తనాలతో పాటు అవసరమైన ఎరువులనూ అత్యంత పారదర్శకంగా అందజేస్తున్నామన్నారు. పంట నష్టాలకు సంబంధించి ఆయా సీజన్‌లోనే పరిహారం అందజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటి వద్దనే వైద్య సేవలు అందుతున్నాయన్నారు. చంద్రబాబు పాలన మొత్తం స్కామ్‌లతోనే కొనసాగిందన్నారు. చంద్రబాబు మాటలు నమ్మే పరిస్థితి లేదన్నారు. గత ప్రభుత్వంలో కేవలం శిలాఫలకాలకే పరిమితమైన బీటీపీ పనులను జగన్‌సర్కార్ వేగవంతం చేసిందన్నారు. త్వరలో బీటీపీ ద్వారా చెరువులన్నీ నింపబోతున్నామన్నారు. కైరేవులోని భూమిలేని రైతులను గుర్తించి మిగులు భూములను పంపిణీ చేస్తామన్నారు. గ్రామ ప్రజల కోరిక మేరకు మారెమ్మ గుడిని రెండు నెలల్లోపు కట్టించి ఇస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ రాజన్న, తహసీల్దార్ ఫణికుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురామరావు, డాక్టర్ తరుణ సాయి, వ్యవసాయాధికారి సంధ్యాకుమారి, సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ గీతమ్మ, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ తిమ్మరాజమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివన్నయాదవ్, సచివాలయ కన్వీనర్ తిమ్మరాజు, కాంట్రాక్టర్లు శ్యాంసుందర్ చౌదరి, హనుమంతరాయుడు, మాజీ ఎంపీపీ రామభీమప్ప, సర్పంచ్‌లు పాలయ్య, ఈరన్న, వన్నూరుస్వామి, విరుపాక్షి, ప్రకాష్, సిద్దలింగప్ప, సింగిల్ విండో సభ్యుడు గొర్ల గంగాధర, నాయకులు ముత్యాలు, హరినాథ రెడ్డి, బి.రమేష్, రామకృష్ణ, రాజశేఖర్, జయరాములు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుప్పకూలిన కాజ్ వే

కణేకల్లు: చిక్కణ్ణేశ్వర చెరువు అవుట్ ఫ్లో రెగ్యులేటర్ అంచున ఉన్న హెచ్చెల్సీ కాజ్ వే మంగళవారం కుప్పకూలింది. గంగలాపురం గ్రామానికి చెందిన రైతు నాగరాజు దాదాపు 190 బస్తాల వరి ధాన్యాన్ని కణేకల్లులోని రైల్ మిల్లుకు తరలిస్తుండగా కాజ్ వే పైకి చేరుకోగానే బరువుకు తాళలేక ఒక్కసారిగా కుప్పకూలింది. 50 బస్తాలు హెచ్చెల్సీలోని నీటి ప్రవాహానికి కొట్టుకెళ్లాయి. డ్రైవర్ రాజు సురక్షితంగా బయటపడ్డాడు. వాహనం పాక్షికంగా దెబ్బతింది. ఘటనతో రూ.లక్ష మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. విషయం తెలుసుకున్న హెచ్చెల్సీ డీఈఈ మద్దిలేటి, ఏఈఈ అల్తాఫ్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. తహసీల్దార్ రజాక్ వలి, ఎస్ఐ దుగ్గిరెడ్డి దగ్గరుండి సహాయక చర్యలు చేపట్టారు. వాహనంలోని వరి బస్తాలను వెలికి తీయించారు.

టీటీడీ ఆధ్వర్యంలో కైశిక ద్వాదశి వేడుకలు

అనంతపురం కల్చరల్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళ కైశిక ద్వాదశి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం అనంతపురంలోని టీటీడీ కల్యాణ మంటపంలో ఫ్లెక్సీలు, బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీటీడీ ప్రోగ్రాం అసిస్టెంట్ బాబు, పండిట్ వేణు మాట్లాడుతూ... ఈ నెల 27న రాప్తాడులోని ఎస్సీ కాలనీలో ఉన్న నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవం, తలుపుల మండలం తూపల్లిలోని గంగమ్మ దేవాలయంల, రాప్తాడు ఎస్సీ కాలనీలోని మారెమ్మ ఆలయంలో, శింగనమల మండలం రాచేపల్లిలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయాల్లో కై శిక ద్వాదశి వేడుకలు ఉంటాయన్నారు. అనంతపురంలోని మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం వేదికగా ఈ నెల 27వ తేదీ వరకూ ఆధ్యాత్మిక ప్రవచనాలు సాగుతాయన్నారు. కార్యక్రమంలో సమరసత సంస్థ ప్రతినిధి నాగేశ్వరరెడ్డి, పండిట్ వరప్రసాద్, సుధామణి, రమేష్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

గుంతకల్లు: కర్ణాటక నుంచి అక్రమంగా తరలించుకు వచ్చిన మద్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను మంగళవారం గుంతకల్లు సెబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మహేష్‌కుమార్ వెల్లడించారు. కసాపురం సమీపంలోని హంద్రీ–నీవా కాలువ వద్ద నంచర్ల వైపు నుంచి వస్తున్న ఆటోను తనిఖీ చేయగా 30 బాక్సుల్లో 2,880 టెట్రా ప్యాకెట్ల మద్యం గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. మద్యం తరలిస్తూ గుంతకల్లులోని దోనిముక్కల రోడ్డులో నివాసముంటున్న బోయ భాస్కర్, అతని తండ్రి ఓబులేసుతో పాటు బోయ నాగరాజు పట్టుబడ్డారు. నిందితులు కర్ణాటకలోని రాయచూరులో మద్యం కొనుగోలు చేసి మంత్రాలయం నుంచి గూడ్స్ వ్యాగస్ ద్వారా నంచర్ల రైల్వే స్టేషన్‌కు చేర్చారు. అక్కడి నుంచి ఆటోలో గుంతకల్లు తరలిస్తూ పట్టుబడ్డారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు సెబ్ పోలీసులు తెలిపారు.

అనధికార స్కానింగ్ సెంటర్ సీజ్

- నిబంధనలకు విరుద్ధంగా గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు
- ఒక్కో స్కాన్‌కు రూ.7 వేల నుంచి రూ.10వేలు వసూలు
- ఇద్దరిపై కేసు నమోదు

అనంతపురం మెడికల్/క్రైం: ఎటువంటి విద్యార్హత, ఆరోగ్యశాఖ అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్న స్కానింగ్ సెంటర్‌ను డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి సీజ్ చేశారు. వివరాలు... అనంతపురానికి చెందిన సునీల్‌కుమార్.. ఓ ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌లో పనిచేసేవాడు. ఇటీవల నగరంలోని ఎర్రనేల కొట్టాలలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఫార్మసిస్ట్ శ్రావణితో కలసి అనధికారికంగా స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేశాడు. అయితే నిర్దిష్టమైన విద్యార్హత లేకున్నా... గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలకే అత్యంత ప్రాధాన్యతనిస్తూ గర్భిణుల ప్రాణాలతో చెలగాటమాడసాగారు. ఈ విషయాన్ని పసిగట్టిన స్థానిక సీపీఎం నేత రామిరెడ్డి సమాచారం అందించడంతో డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి, తహసీల్దార్ బాలకృష్ణ, అనంతపురం మూడో పట్టణ పోలీసులు మంగళవారం ఉదయం అక్కడకు చేరుకుని పరిశీలించారు. నగరంలోని కొన్ని ప్రముఖ ప్రైవేట్ ఆస్పత్రులకు అనుబంధంగా ఈ సెంటర్ పనిచేస్తున్నట్లు గుర్తించారు.



స్కానింగ్ సెంటర్ నిర్వాహకుడు సునీల్‌కుమార్‌ను ప్రశ్నిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి

అత్యంత ప్రమాదకర పరీక్షలు నిర్వహిస్తూ...

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్ష నేరమని చట్టం పేర్కొంటున్నా సునీల్‌కుమార్ పట్టించుకోలేదు. అత్యంత ప్రమాదకరమైన ట్రాన్స్‌వాజినల్ అల్ట్రాసోనోగ్రఫీ (యోని మార్గం ద్వారా గర్భంలోకి పైప్ పంపి స్కాన్ చేయడం) ద్వారా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లుగా గుర్తించిన డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ తరహా పరీక్షలు నిర్వహించే నైపుణ్యం, విద్యార్హతపై ఆరా తీశారు. ఎలాంటి విద్యార్హత లేదని తెలుసుకున్న ఆమె మరింత అసహనానికి గురయ్యారు. డీఎంహెచ్ఓ అడిగిన పలు ప్రశ్నలకు సునీల్‌కుమార్ నుంచి మౌనమే సమాధానమైంది. దీంతో స్కానింగ్ మిషన్, లింగ నిర్ధారణకు ఉపయోగించే రసాయనాలు, ట్రాన్స్‌వాజినల్ స్కానింగ్ పరికరాలు తదితరాలను సీజ్ చేసి, నిర్వాహకులు సునీల్‌కుమార్, శ్రావణిని పోలీసులకు అప్పగించారు. నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

చట్టపరమైన చర్యలు

నాలుగు నెలల క్రితం చీరల వ్యాపారం పేరుతో ఇంటిని అద్దెకు తీసుకుని అనధికారికంగా సునీల్‌కుమార్, ఫార్మసిస్ట్ శ్రావణి స్కానింగ్ నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఒక్కో స్కాన్‌కు రూ.7 వేల నుంచి రూ.10వేలు తీసుకుంటున్నట్లు వారి వద్ద ఉన్న పుస్తకంలో స్పష్టంగా రాసి ఉంది. సాధారణ స్కాన్‌కు అంత పెద్ద మొత్తంలో ఎవరూ డబ్బు తీసుకోరు. గర్భస్థ శిశువు లింగనిర్ధారణ స్కానింగ్‌లు చేసినట్లుగా గుర్తించాం. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ భ్రమరాంబదేవి, డీఎంహెచ్ఓ

సెబ్ పోలీసుల ఓవరాక్షన్

- వాకింగ్‌కు వెళ్లిన టెక్కీపై దాడి
- తలకు తీవ్ర గాయం
- విషయాన్ని బయటకు పొక్కనివ్వకుండా రాజీ యత్నం

అనంతపురం క్రైం: వాకింగ్‌కు వెళ్లిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై సెబ్ పోలీసులు విరుచుకు పడ్డారు. విచక్షణా రహితంగా దాడి చేయడంతో తలకు తీవ్ర గాయమైంది. పరిస్థితి విషమంగా సమాచారం. వివరాలు... తాడిపత్రికి చెందిన ఓ వ్యక్తి అనంతపురంలో ఉంటూ భారీగా కర్ణాటక మద్యాన్ని డంప్ చేసుకుంటున్నట్లు సెబ్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో పక్కా ఆధారాలతో నిందితుడిని పట్టుకోవాలని మంగళవారం తెల్లవారుజాము 5.30 గంటలకు జేఎన్‌టీయూ కళాశాల వద్ద సెబ్ కానిస్టేబుళ్లు మారుతి, రాజగోపాల్ కాపు కాశారు. ఆ సమయంలో అటుగా వాకింగ్‌కు వచ్చిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ చంద్రశేఖరరెడ్డిని చూసి అనుమానంతో వెంబడించారు.

కారణాలు చెప్పకుండానే దాడి

వాకింగ్ చేసుకుంటూ జేఎన్‌టీయూ కళాశాల వెనుకవైపు చేరుకోగానే ఒక్కసారిగా చంద్రశేఖరరెడ్డిపై కానిస్టేబుళ్లు దాడి చేశారు. ఘటనతో బెంబేలెత్తిన టెక్కీ... వారిద్దరినీ దొంగలుగా భావించి తన మెడలోని బంగారు గొలుసు, చేతికున్న ఉంగరాన్ని, కొంత డబ్బు ఇచ్చి తనను వదిలిపెట్టాలని ప్రాధేయపడ్డాడు. అదే సమయంలో అతనే మద్యం స్మగ్లర్‌గా భావించిన కానిస్టేబుళ్లు మరింత రెచ్చిపోయారు. దెబ్బలు తాళలేని టెక్కీ వెంటనే ప్రతిదాడి చేస్తూ ఓ కానిస్టేబుల్ చేతిని గట్టిగా కరిచి తప్పించుకోబోయాడు. ఈ క్రమంలోనే చేతికి చిక్కిన ఓ పదునైన వస్తువుతో కానిస్టేబుళ్లు దాడి చేయడంతో టెక్కీ తలకు బలమైన రక్తగాయమైంది.



చంద్రశేఖరరెడ్డి తలకు కుట్లు వేస్తున్న దృశ్యం

వాస్తవం తెలుసుకుని జారుకున్న పోలీసులు

తల నుంచి ధారాపాతంగా రక్తం కారుతుండడంతో ఒక్కసారిగా నీరసపడిపోయిన చంద్రశేఖరరెడ్డి... తనపై ఎందుకు దాడి చేస్తున్నారని నిలదీశాడు. దీంతో తాము సెబ్ పోలీసులమని తెలిపి.. కర్ణాటక మద్యం సరఫరా చేసే వ్యక్తి అవునా? కాదా అని ప్రశ్నించారు. దీంతో తాను సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌నని ఆయన తెలపడంతో ఏం చేయాలో తెలియక క్షతగాత్రుడిని అక్కడే వదిలేసి సెబ్ కానిస్టేబుళ్లు చిన్నగా జారుకున్నారు. అదే సమయంలో అటుగా వచ్చిన స్థానికులు క్షతగాత్రుడిని గమనించి సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. తలకు నాలుగు కుట్లు పడ్డాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో నగర శివారులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న నగర డీఎస్పీతో పాటు వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప రంగంలో దిగి విషయం బట్టబయలు కాకుండా బాధిత కుటుంబసభ్యులతో రాజీ యత్నాలు మొదలు పెట్టారు.

ప్రతి టీచరూ కొత్తగా ఆలోచించాలి

- శిక్షణలో నేర్చుకున్న అంశాలను బోధనలో వినియోగించాలి
- కేజీబీవీ సీఆర్టీ, పీజీటీల రాష్ట్రస్థాయి శిక్షణ ముగింపు కార్యక్రమంలో కేజీబీవీల సెక్రటరీ మధుసూదన్‌రావు



మాట్లాడుతున్న మధుసూదన్‌రావు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రతి టీచరూ కొత్తగా ఆలోచనలతో బోధనలు సాగిస్తే వినూత్న ఆవిష్కరణలు వెలుగులోకి వస్తాయని పాఠశాల విద్య అడిషనల్ డైరెక్టర్, కేజీబీవీ పాఠశాలల కార్యదర్శి మధుసూదన్‌రావు పేర్కొన్నారు. కేజీబీవీల్లో కొత్తగా నియామకమైన సీఆర్టీలు, పీజీటీలకు అనంతపురం శివారులోని వైటీ శివారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 'ఇండక్షన్ శిక్షణ' తరగతులు ఏర్పాటు చేశారు. ఈ నెల 16న ప్రారంభమైన శిక్షణా తరగతులు మంగళవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మధుసూదన్‌రావు మాట్లాడుతూ.. జ్ఞానం, భాష, నడక, ఆహార్యం తదితర అంశాల్లో పిల్లలకు టీచర్లు రోల్ మోడల్‌గా నిలవాలన్నారు. అనాథ, తల్లో తండ్రో లేని, నిరుపేద ఆడపిల్లలు చదువుకునే కేజీబీవీల్లో ఆయా పిల్లల ఆర్థిక, సామాజిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఉన్నతంగా తీర్చిదిద్దాలని కోరారు. డీఈఓ నాగరాజు, సమగ్ర శిక్ష ఏపీసీ వరప్రసాదరావు, జీసీడీఓ మహేశ్వరి మాట్లాడుతూ ఇక్కడ నేర్చుకున్న విలువైన అంశాలను కేజీబీవీల్లో అమలు చేసి విద్యార్థినుల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ చంద్రమోహన్‌రెడ్డి, అలెస్కో గోవిందరెడ్డి, ఎంఈఓలు గురుప్రసాద్, ఓబుళపతి, అసిస్టెంట్ సీఎంఓ గోపాలకృష్ణయ్య, అసిస్టెంట్ ఏఎంఓలు మాధవరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పని చేయాలి

'మీరు చెప్పే చదువుతోనే నిరుపేద పిల్లలు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు. అలాంటి వృత్తిలోకి వచ్చిన మీరందరూ బాధ్యతగా పని చేయాలి' అని కేజీబీవీ ఉపాధ్యాయులకు మధుసూదన్‌రావు సూచించారు. మంగళవారం ఆయన రాప్తాడు, గార్లదిన్నె కేజీబీవీలను తనిఖీ చేశారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. నోట్ బుక్‌ల కరెక్షన్ చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. పిల్లలు తప్పులుగా రాసిన వాటిని కరెక్షన్ చేయకపోతే వారికి ఎలా తెలుస్తుందని సీఆర్టీలను ప్రశ్నించారు. పిల్లల భవిష్యత్తు టీచర్లపైనే ఆధారపడి ఉంటుందనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తోందని అందుకు తగ్గట్టు పిల్లలకు చదువు చెప్పాల్సిన బాధ్యత టీచర్లపై ఉందన్నారు.

వర్సిటీలో నేడు వైఎస్సార్ విగ్రహావిష్కరణ

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించనున్నారు. ముఖ్య అతిథిగా ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హాజరుకానున్నారు. అలాగే లా విభాగం నుంచి కామన్ మెస్ హాల్ వరకూ 60 అడుగుల వెడల్పుతో నిర్మించిన రోడ్డు, సరస్వతి హాస్టల్, లా విభాగంలో మూట్ కోర్టునూ ప్రారంభించనున్నారు.

ఆరుతడి పంటలే సాగు చేయండి

అనంతపురం అగ్రికల్చర్: వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున ప్రస్తుత రబీలో వరి లాంటి నీటి వినియోగం ఎక్కువగా ఉన్న పంటలు వేయడం మంచిదికాదని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.అశోక్‌కుమార్, వీఎస్ సుధీర్ అన్నారు. వాటి స్థానంలో ఆరుతడి పంటలు సాగు చేయడం శ్రేయస్కరమని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వేరుశనగ, చిరుధాన్యాలు, మొక్కజొన్న లాంటి పంటలు వేసుకోవాలన్నారు. ఖరీఫ్‌లో వేసిన కంది పంట ప్రస్తుతం పూత నుంచి కాయ దశలో ఉన్నందున అవకాశం ఉంటే నీటి తడి ఇచ్చుకుంటే మంచి దిగుబడులు వస్తాయన్నారు. అలాగే కందిలో శనగపచ్చ పురుగు ఆశించినట్లు గమనిస్తే ఎకరాకు 10 నుంచి 15 పక్షిస్థావరాలు, లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలని సూచించారు. తొలిదశలో పురుగు నివారణకు లీటర్ నీటికి 5 మి.లీ వేపగింజల కషాయం కలిపి పిచికారీ చేయాలన్నారు. పురుగు ఉధృతి అధికంగా ఉంటే మొగ్గ దశలో లీటర్ నీటికి 2.5 మి.లీ క్లోరిపైరిపాస్ + 5 మి.లీ వేపనూనె కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే పూత, కాయ దశలో ఉంటే లీటర్ నీటికి 0.3 మి.లీ క్లోరాంట్రనిలిప్రోల్ లేదా 0.4 గ్రాములు ఎమామెక్టిన్ బెంజోయేట్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కాగా, రాగల మూడు రోజులు జిల్లాకు తేలిక పాటి వర్షసూచన ఉందన్నారు.

26 నుంచి గూగూడు కుళ్లాయిస్వామి ధర్మ ప్రచార వారోత్సవాలు

- పోస్టర్లు విడుదల చేసిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

శింగనమల: నార్పల మండలంలోని గూగూడులో వెలసిన కుళ్లాయిస్వామి సన్నిధిలో ఈ నెల 26 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకూ ధర్మ ప్రచార వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. 26న మహిళలకు ముగ్గుల పోటీలు, 27న కుళ్లాయిస్వామి గంధోత్సవం, పల్లకీ సేవ, 28న ఆంజినేయ స్వామికి పంచామృతాభిషేకం, హనుమాన్ చాలీసా పారాయణం ఉంటుంది. 29న ఆధ్యాత్మిక ప్రవచనాలు, 30న హరికథ కాలక్షపం, డిసెంబరు 1న పెద్దమ్మ తల్లికి కుంకుమార్చన, 2న కోలాటం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఈఓ శోభ, దేవాలయ కమిటీ చైర్మన్ శివశంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఎన్‌ఎంఎంఎస్ హాల్‌టికెట్లు

అనంతపురం ఎడ్యుకేషన్: డిసెంబరు 3న జరిగే నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని డీఈఓ నాగరాజు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. WWW.BSE.AP.GOV.IN లో స్కూల్ యూడైస్ కోడ్ ద్వారా లాగిన్ అయి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందజేయాలని ఆదేశించారు.

కేజీబీవీల్లో గెస్ట్ ఫ్యాకల్టీకి అవకాశం

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పీజీటీ, సీఆర్టీ పోస్టుల భర్తీలో భాగంగా గతంలో పని చేసిన 30 మందికి వారి సీనియార్టీని అనుసరించి మరోసారి అవకాశం కల్పించారు. ఈ మేరకు ఎస్పీడీ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు అందుకున్న వారు వెంటనే ఆయా కేజీబీవీల్లో చేరాలని సమగ్ర శిక్ష ఏపీసీ వరప్రసాదరావు, జీసీడీఓ మహేశ్వరి సూచించారు.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: అయ్యప్పస్వాముల రద్దీ దష్ట్యా .డిసెంబర్, జనవరి నెలల్లో ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను శబరిమలకు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 10, 17 తేదీల్లో సికింద్రాబాద్ జంక్షన్ (07131) నుంచి సాయంత్రం 4.00 గంటలకు బయలుదేరి కొల్లంకు మరుసటి రోజు రాత్రి 11.55 గంటలకు చేరుతుందని పేర్కొన్నారు. తిరిగి ఈ రైలు (07132) కొల్లం జంక్షన్ నుంచి 12, 19వ తేదీల్లో అర్ధరాత్రి 2.30 గంటలకు బయలుదేరి సికింద్రాబాద్‌కు మరుసటి రోజు ఉదయం 9.30 గంటలకు చేరుతుందన్నారు. ఈ రైలు కర్నూలు సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి మీదుగా రాకపోకలు సాగిస్తుందన్నారు. ఇక జనవరి ఏడో తేదీ సాయంత్రం 4.50 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్ నుంచి రైలు (07133) బయలుదేరి మరుసటి రోజు రాత్రి 11.55 గంటలకు కొల్లం జంక్షన్‌కు చేరుతుందన్నారు. తిరిగి ఈ రైలు (07134) 9వ తేదీ రాత్రి 2.30 గంటలకు కొల్లం జంక్షన్ నుంచి బయలుదేరి సికింద్రాబాద్‌కు రాత్రి 10.00 చేరుతుందని తెలిపారు. ఈ రైలు రాయచూర్, మంత్రాలయం రోడ్డు, ఆదోని గుంతకలు, గుత్తి, తాడిపత్రి మీదుగా రాకపోకలు సాగిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

టెన్త్ విద్యార్థుల ఫీజు గడువు పొడిగింపు

అనంతపురం ఎడ్యుకేషన్: మార్చి–2024లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాయబోయే రెగ్యులర్, ఫెయిల్ (ప్రైవేట్) విద్యార్థులు ఫీజు చెల్లించేందుకు అపరాధ రుసుం లేకుండా చివరి అవకాశంగా ఈ నెల 30 వరకు గడువు పొడిగించారు. రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకూ కలిపి రూ.125, ఫెయిలైన విద్యార్థులు మూడు సబ్జెక్టుల వరకు రూ.110, ఆపైన సబ్జెక్టులకు రూ.125, మైగ్రేషన్ పత్రం కోసం రూ.80 చెల్లించాల్సి ఉంటుందని డీఈఓ నాగరాజు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ స్పష్టం చేశారు. అలాగే రూ.50 అపరాధ రుసుంతో డిసెంబరు 1 నుంచి 4 వరకు, రూ.200 అపరాధ రుసుంతో 5 నుంచి 9 వరకు, రూ.500 అపరాధ రుసుంతో డిసెంబరు 10 నుంచి 14 వరకు చెల్లించవచ్చని స్పష్టం చేశారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు 26 వరకు గడువు

సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు ఈ నెల 26 వరకు గడువు పొడిగించినట్లు డీఈఓ నాగరాజు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ తెలిపారు. రూ.200 అపరాధ రుసుంతో ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లాలోని అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా ఇప్పటిదాకా పదో తరగతిలో 700, ఇంటర్‌లో 2,300 అడ్మిషన్లు పొందినట్లు వెల్లడించారు.

జనవాక్కు

మేమూ ఓ ఇంటి వాళ్లమయ్యాం



పదేళ్లుగా ఐదుగురు కుమార్తెలతో కలసి నేను, నా భర్త మారెప్ప అద్దె ఇంట్లోనే కాపురం నెట్టుకొచ్చాం. సొంతిల్లు కావాలని అధికారులను, నాయకులను ప్రాధేయపడ్డాం. ఎవరూ పట్టించుకోలేదు. గత ప్రభుత్వంలో జన్మభూమి కార్యక్రమాల్లో లెక్కలేనన్ని అర్జీలు ఇచ్చా. అవన్నీ చించి అవతల పడేశారు. చివరకు సొంతిల్లు కలగానే మిగులుతుందని అనుకున్నా. అయితే వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత మా బతుకులు క్రమంగా మారుతూ వచ్చాయి. ఆఫీసు మెట్లు కూడా ఎక్కకుండానే వలంటీరే వివరాలు తీసుకెళ్లి, పట్టా తెచ్చిచ్చాడు. ప్రభుత్వ సాయంతో ఇల్లు కూడా కట్టుకున్నాం. సీఎం వైఎస్ జగన్ చలువతోనే మేమూ ఓ ఇంటి వాళ్లమయ్యాం.

– బోయ మారెక్క, గొంచిరెడ్డిపల్లి, బ్రహ్మసముద్రం మండలం

సొంతింటి కల నెరవేరింది



పదహైదేళ్లుగా అద్దె ఇంట్లోనే నివాసముంటున్నాం. సొంతిల్లు కావాలని గతంలో తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం దక్కలేదు. నాయకుల వద్ద మొర పెట్టుకున్నా పట్టించుకోలేదు. జన్మభూమి గ్రామ సభల్లో ఇచ్చిన అర్జీలన్నీ చెత్తకుప్పల పాలయ్యాయి. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న తర్వాత వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ఇంటి వద్దనే దక్కుతున్నాయి. ఇల్లు లేదన్న విషయం తెలుసుకున్న వలంటీర్ వివరాలు తీసుకెళ్లి రోజుల వ్యవధిలోనే పట్టా తీసుకొచ్చి ఇచ్చారు. అధికారుల చొరవతో ఇంటి నిర్మాణం శరవేగంగా సాగుతోంది. త్వరలో సొంతింట్లోకి చేరుకుంటా. సొంతింటి కలను సాకారం చేసిన సీఎం జగనన్నకు కృతజ్ఞతలు.

– రూప, కంబదూరు

ఇంటి వద్దకే పట్టా తెచ్చిచ్చారు



గతంలో అద్దె ఇంట్లో ఉంటూ చాలా ఇబ్బందులు పడ్డాం. సొంతిల్లు కోసం గతంలో పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం దక్కలేదు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత వలంటీర్ వచ్చి వివరాలు తీసుకెళ్లి, రోజుల వ్యవధిలోనే మాకు ఇంటి పట్టా తెచ్చిచ్చారు. తర్వాత ఇల్లు కూడా ప్రభుత్వం కట్టించి ఇచ్చింది. సీఎం వైఎస్ జగనన్న చలువతోనే మేమూ ఓ ఇంటి వాళ్లమయ్యాం.

– సుహాసిని, బుక్కరాయసముద్రం

సర్టిఫికెట్లు ఇచ్చారు



సీఎం వైఎస్ జగన్ చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంతో నాకెంతో మేలు జరిగింది. గతంలో సర్టిఫికెట్ల కోసం మండల కేంద్రానికి వెళ్లేవాళ్లం. అక్కడ అధికారులు లేరంటే ఆ రోజంతా వృథా అయ్యేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా జగనన్న సురక్ష కార్యక్రమం కింద మా ఇంటి వద్దనే కుల, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్లను అధికారులు అందజేశారు. ఇందు కోసం నయా పైసా కూడా ఖర్చు పెట్టలేదు. సర్టిఫికెట్లు రావడంతో కొన్ని సంక్షేమ పథకాలకు అర్హత సాధించా. మా అవసరాలు తెలుసుకుని తీరుస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు.

– మేకల లక్ష్మీదేవి, తెలికి, పెద్దవడుగూరు మండలం

పోలీసులే అన్యాయం చేస్తున్నారు

- పుట్టపర్తి ఏఆర్ ఎస్ఐ శంకర్ ఆవేదన

అనంతపురం క్రైం: పిత్రార్జితంగా తనకు చెందాల్సిన భూమిని ఫోర్జరీ సంతకాలతో సొంత తమ్ముడే కాజేస్తే న్యాయం చేయాల్సిన నార్పల పోలీసులు డబ్బు తీసుకుని అన్యాయం చేస్తున్నారంటూ పుట్టపర్తి ఏఆర్ ఎస్ఐ శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం అనంతపురంలోని డీఎస్పీ కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. నాయనపల్లిలో తమకు పది ఎకరాల భూమి ఉందన్నారు. తండ్రి మరణానంతరం ఆ భూమిని తల్లి పేరు మీద తమ్ముడు ధనుంజయ (సివిల్ కానిస్టేబుల్) మార్చాడన్నారు. తిరిగి ఆ భూమిని ఆయన భార్య పేరుపై మార్చుకుని, తన వాటా ఇవ్వకుండా బెదిరింపులకు దిగాడన్నారు. ఇదే విషయంగా తనను హతమార్చేందుకు కుట్ర పన్నుతున్నాడని ఆరోపించారు. ఈ విషయంపై నార్పల పోలీసులకు ఫిర్యాదు చేస్తే కనీస చర్యలు తీసుకోలేదని, తన సోదరుడి వద్ద డబ్బులు తీసుకుని కేసును నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో జిల్లా పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయించినట్లు వివరించారు.

వ్యక్తి ఆత్మహత్య



చంద్రశేఖర్ (ఫైల్)

గార్లదిన్నె: కొడుకు చేసిన అప్పులు తీర్చాలంటూ ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు గొడవ చేయడంతో అవమానం తాళలేక తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నెకు చెందిన చంద్రశేఖర్ (52), నాగలక్ష్మి దంపతులు వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్నారు. వీరి ఏకైక కుమారుడు మణికంఠ బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో బెట్టింగ్‌లకు అలవాటు పడిన మణికంఠ తన అవసరాల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు చేశాడు. వాటిని తీర్చలేక ముఖం చాటేయడంతో వడ్డీ వ్యాపారులు గార్లదిన్నెకు చేరుకుని చంద్రశేఖర్‌ను నిలదీశారు. దీంతో గ్రామంలో పరువు పోయిందంటూ మనోవేదనకు లోనైన ఆయన మంగళవారం ఉదయం తన పొలంలోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ సూర్యనారాయణ తెలిపారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు రాప్తాడు విద్యార్థులు



హెచ్‌ఎం, పీడీలతో విద్యార్థులు

కనగానపల్లి (రాప్తాడు): రాప్తాడు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జరిగే ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు నరసింహులు తెలిపారు. స్థానిక పాఠశాలలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి ఉరవకొండలో జరుగుతున్న ఖోఖో శిక్షణ శిబిరంలో విద్యార్థులు పాల్గొని, ప్రతిభ కనబరిచారు. అనంతపురం జిల్లా జట్టు తరపున పాఠశాల విద్యార్థులు లోహిత్, హర్షవర్ధన్, పూర్ణచందు, సాహిత్యను ఎంపిక చేశఖరారు. వీరు ఈ నెల 25 నుంచి 28 వరకు నరసరావుపేటలో జరగనున్న సబ్ జూనియర్ ఖోఖో పోటీల్లో పాల్గొంటారన్నారు. పీడీలు రాజశేఖర్‌రెడ్డి, కేశవమూర్తి పాల్గొన్నారు.

ప్రతి పంటకూ పరిహారం ఇవ్వాలి



స్థల పరిశీలన చేస్తున్న జేసీ కేతన్‌గార్గ్

ఆత్మకూరు: మండలంలో వర్షాభావంతో నష్టపోయిన రైతులకు ప్రతి పంటకూ పరిహారం ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరికి ఎంపీపీ హేమలత, వడ్డుపల్లి సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి, మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ వడ్డుపల్లి నరసింహారెడ్డి వినతిపత్రం అందించారు. మంగళవారం ఆత్మకూరు మండలంలోని పంపనూరు వద్ద సాగు చేసి ఆముదం పంటను జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరి పరిశీలించారు. ఆముదం, కంది సాగు చేసిన పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ రవి, ఏఓ సుచరిత, ఏఈఓ సుజిత, వ్యవసాయ సిబ్బంది నరసింహులు, భారతి, శోభ, భాగ్యలక్ష్మి తదితర రైతులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాణేల ప్రదర్శన




మాట్లాడుతున్న పురావస్తు శాఖ ఏడీ రజిత

అనంతపురం కల్చరల్: పురావస్తు శాఖ, జిల్లా టూరిజం శాఖ, ఇంటాక్ (భారతీయ కళలు, సంస్కృతీ పరిరక్షణ సంస్థ) సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రపంచ వారసత్వ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన పురాతన నాణేల ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది. మంగళవారం స్థానిక రోటరీ క్లబ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రదర్శన, అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన పురావస్తుశాఖ సహాయ సంచాలకులు రజిత మాట్లాడుతూ జిల్లాలో ఎన్నో కోటలు, శాసనాలు, పురాతన భవనాలతో పాటు అనేక సందర్భాల్లో నాణేలు చరిత్రను ప్రతిబింబించాయన్నారు. ఇంటాక్ ప్రతినిధులు రాంకుమార్, వేణుగోపాలరెడ్డి, నాణేల సేకరణదారుడు గుప్తా, ప్రిన్సిపాల్ శశికళ మాట్లాడారు.

అరుదైన జబ్బుకు చికిత్స

అనంతపురం మెడికల్: కిమ్స్ సవీర ఆస్పత్రి వైద్యులు కండరాల బలహీనతతో (మయాస్తీనియా గ్రేవిస్) బాధపడుతున్న ఓ మహిళకు చికిత్స చేశారు. అందుకు సంబంధించిన వివరాలను ఆస్పత్రిలో సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్టు డాక్టర్ కే జాషువా కాలేబ్ మంగళవారం తెలియజేశారు. గుత్తికి చెందిన సుజాత అనే 50 ఏళ్ల మహిళ రెండేళ్లుగా కండరాల బలహీనతతో బాధపడుతోంది. ప్రాణాంతక వ్యాధికి చికిత్స చేసినట్లు వైద్యుడు తెలిపారు. లక్ష మందిలో ఇద్దరు లేదా ఐదుగురు మాత్రమే ఇలాంటి వ్యాధి బారిన పడతారన్నారు.

కబడ్డీ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ లక్ష్మయ్య

అనంతపురం: ఈ నెల 22న తమిళనాడులోని కరైకుడిలో ఉన్న అలగప్ప యూనివర్సిటీలో జరిగే ఆలిండియా యూనివర్సిటీస్ సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ ఉమెన్ కబడ్డీ టోర్నీలో ప్రాతినిథ్యం వహించే ఎస్కేయూ జట్టును మంగళవారం ఎంపిక చేశారు. నగరంలోని కేఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన రమావత్ వైజయంతిమాల, భనావత్ దివ్యజ్యోతి, రమావతి పావని, గుంతకల్లులోని ఎస్ఎస్‌జీఎస్ కళాశాలకు చెందిన బోయ ప్రమీల, కె.చిట్టెమ్మ, అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ విద్యార్థినులు ఉపేంద్రం విజయవాహిని, సుగాలి వైష్ణవి, ఎస్కేయూ క్యాంపస్ కళాశాలకు చెందిన ఉప్పలపాటి నరసమ్మ, క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని నడింపల్లి సింధు, శ్రీసత్యసాయి జిల్లా జగరాజుపల్లిలోని మంగళకర డిగ్రీ కళాశాల విద్యార్థిని కురుబ ధరణి, అనంతపురం ఆర్ట్స్ కళాశాలకు చెందిన లేపాక్షి మానస ఎంపికయ్యారు. విద్యార్థులను ఎస్కేయూ వీసీ రామకృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ లక్ష్మయ్య, స్పోర్ట్స్ సెక్రటరీ డాక్టర్ శ్రీనివాసన్ అభినందించారు.

నగరంలో నందన వనాలు



- వేగంగా పనులు
- రూ.78 లక్షలతో ఐదు పార్కుల అభివృద్ధి

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని పార్కుల అభివృద్ధిపై పాలకవర్గం దృష్టి సారించింది. నగరపాలక సంస్థ అధికారులు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కొన్ని పార్కుల్లో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే నగర ప్రజలకు మరింత ఆహ్లాదకరమైన వాతావరణం అందనుంది.

నగరంలో మొత్తం 25 పార్కులు ఉన్నాయి. అందులో అత్యంత ప్రజాధరణ కలిగిన పార్కుల్లో దెబ్బతిన్న వాకింగ్ ట్రాక్, తదితర పనులను పునరుద్ధరించాలని పాలకవర్గం నిర్ణయించింది. ఈ క్రమంలో నగరంలోని హౌసింగ్ బోర్డు రాజీవ్‌చిల్డ్రన్స్, రాంనగర్ సిద్ధార్థ పార్క్, లెక్చరర్స్ కాలనీలోని



రాజీవ్‌చిల్డ్రన్స్ పార్కులో వాకింగ్ ట్రాక్ పనులను పరిశీలిస్తున్న దృశ్యం



రాంనగర్‌లోని సిద్ధార్థ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులు

పార్కు, సాయినగర్‌లోని నేతాజీ పార్కు, ఆర్‌కే నగర్ పార్కులలో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. రూ.27 లక్షలతో సిద్ధార్థ పార్కులో కాంపౌండ్ వాల్ ప్లాస్టింగ్, మొక్కలు, రూ.13 లక్షలతో (రెండు వర్కులు) రాజీవ్ చిల్డ్రన్స్ పార్కులో రెండు వాకింగ్ ట్రాక్, ఫ్లడ్‌లైట్స్, రూ.4 లక్షలతో లెక్చరర్స్‌కాలనీ పార్కులో వాకింగ్ ట్రాక్, ఆట వస్తువులు, బోర్, మొక్కలు, రూ.4 లక్షలతో ఆర్‌కే నగర్ పార్కులో వాల్ పెయింటింగ్, వాకింగ్ ట్రాక్, మొక్కలు తదితర అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. టెండర్ నిర్వహణ పూర్తయ్యి, పలుచోట్ల పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయి. దీంతో పాటుగా సాయినగర్ నేతాజీ పార్క్ అభివృద్ధి రూ.30 లక్షలు కేటాయించారు. ఈ పనులకు టెండర్ పిలవాల్సి ఉంది. ఈ పనులు పూర్తయితే నగర ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉంటాయి.

> **సకాలంలో పూర్తి చేస్తాం**
> ఉన్నతాధికారుల ఆదేశాలతో నగరంలో పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. నగరంలోని 5 పార్కుల్లో అభివృద్ధి పనులకు టెండర్లు ఆహ్వానించాం. అందులో మూడు పార్కుల్లో పనులు జరుగుతున్నాయి. సకాలంలో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.
> – లక్ష్మీప్రసన్న, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్

టీడీపీ హయాంలో డివైడర్లకే పరిమితం



ఉమానగర్‌లో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి

అనంతపురం కార్పొరేషన్: టీడీపీ ప్రభుత్వ హయాంలో నగరాభివృద్ధి డివైడర్లకే పరిమితమైందని, అధికారంలో ఉన్నంత కాలం ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్ కలహాలతో అభివృద్ధిని పట్టించుకోలేదని మేయర్ వసీం విమర్శించారు. మంగళవారం నగరంలోని 21,22 సచివాలయాల పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సూర్యనగర్ సర్కిల్ సమీపంలో, ఉమానగర్‌లో జరిగిన కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య సంక్షేమం, అభివృద్ధి బోర్డులు, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు.

మరోసారి జగనన్నను సీఎం చేసుకుందాం..

మేయర్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఊహకందని సంక్షేమం, అభివృద్ధి జరిగిందన్నారు. రూ.800 కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. సచివాలయ వ్యవస్థతో ఇంటి వద్దకే పథకాలు అమలు చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని కొనియాడారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉండాలన్నారు. డిప్యూటీ మేయర్లు, వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ నవరత్నాల ద్వారా పేద, సామాన్య మధ్యతరగతి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి పథకంలో మహిళలను భాగస్వామ్యం చేసి మహిళాసాధికారత దిశగా చర్యలు తీసుకున్నారన్నారు.కార్యక్రమంలో కార్పొరేటర్ అబూసలేహా, కార్పొరేట్ అనిల్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతా సోమశేఖర్ రెడ్డి, క్లస్టర్ అధ్యక్షులు రమణారెడ్డి, జగదీష్, జేసీఎస్ కన్వీనర్ లక్ష్మన్న, రాష్ట్ర పర్యాటక శాఖ డైరెక్టర్ భూమిరెడ్డి జాహ్నవి, పార్టీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, ఎంఎల్‌ఓ అమర్నాథ్ రెడ్డి, పార్టీ నాయకులు బండి శ్రీకాంత్, అట్టె శ్రీనివాసులు, సాయి, ఫయాజ్, షెక్షావలి, జహానీ, అవైజ్, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వే పక్కాగా చేపట్టాలి



మాట్లాడుతున్న కమిషనర్ భాగ్యలక్ష్మి

అనంతపురం కార్పొరేషన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణన సర్వే పక్కాగా చేపట్టాలని కమిషనర్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం కులగణన సర్వేకు సంబంధించి మున్సిపల్ ఆర్‌డీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సచివాలయాల వారీగా నోడల్ ఆఫీసర్లు, సీఓలు, శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి సర్వే ప్రారంభించి వారంలోపు పూర్తి చేయాలన్నారు. కులగణన సర్వే యాప్‌లో వలంటీర్, కార్యదర్శులు.. సర్వే చేసుకుంటున్న వారి ఈకేవైసీ చేయాల్సి ఉంటుందన్నారు. అదనపు కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ వలంటీర్ యాప్‌లో తీసుకున్న డేటాను స్క్రీన్ షాట్, డౌన్‌లోడ్ కూడా చేసుకోలేరన్నారు. కార్యదర్శి, వలంటీర్ సూక్ష్మ ప్రణాళిక చేసుకొని సర్వేను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి, తదితరులు పాల్గొన్నారు.

'బాధిత బాలికకు న్యాయం చేస్తాం'



బాలిక తల్లితో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: ఏపీపీ దాడిలో తీవ్రంగా గాయపడి సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని మేయర్ వసీం తెలిపారు. మంగళవారం సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత బాలికను మేయర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. బాలికపై జరిగిన దాడి విషయాన్ని బాధితురాలి తల్లితో అడిగి తెలుసుకుని, ఆమెను ఓదార్చారు. బాలికకు మెరుగైన వైద్యం అందించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావును ఆదేశించారు. మేయర్ మాట్లాడుతూ బాలికను మానవతాదృక్పథంతో ఆదుకుంటామన్నారు. బాధ్యాతాయుతమైన పదవిలో ఉన్న అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలికను పనిలో పెట్టుకోవడమే కాకుండా, దారుణంగా హింసించడం బాధాకరమన్నారు. బాలికకు వేధింపులకు గురి చేసిన వారిని శిక్షించాలని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. బాలికపై జరిగిన దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఇలాంటి వాటిని కూడా రాజకీయం చేయడం సరికాదన్నారు. వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, కార్పొరేటర్ బాబాఫక్రుద్దీన్, కోఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, వైఎస్సార్ సీపీ నాయకులు ఖాజా, జావిద్, మాబ్బాషా, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం అర్బన్: సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు మంగళవారం కలెక్టరేట్ వద్ద వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుళు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం మాట్లాడారు. మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనంతో పాటు హెల్త్, రిస్క్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటనారయణ, గురురాజ, ఎర్రిస్వామి, తిరుమలేశు, రాము, తిప్పేస్వామి, రామాంజనేయులు పాల్గొన్నారు.

రాప్తాడులో బంపర్ మెజార్టీతో గెలుస్తాం



ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీపీ, పార్టీ కన్వీనర్, ఇతర నాయకులు

రాప్తాడురూరల్: ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాటు రాప్తాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేసిన సేవా కార్యక్రమాలతో 2024 ఎన్నికల్లో రాప్తాడులో మళ్లీ వైఎస్సార్‌సీపీ గెలుపొందుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. సచివాలయంలో డిజిటల్ బోర్డును ఎంపీపీ వరలక్ష్మీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.రాధమ్మ, సర్పంచ్ పుష్పావతి, ఎంపీటీసీ సభ్యుడు సంజీవరాయుడు ప్రారంభించారు. నాయకులు మాట్లాడుతూ దేశంలోనే పార్టీలు,కులాలు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అలాంటి ముఖ్యమంత్రికి అన్ని వర్గాలూ అండగా ఉంటాయన్నారు. ఎస్‌ఆర్ కాలనీలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆంజనేయస్వామి ఆలయం, పీర్ల మకానం వద్ద స్థానిక సమస్యలపై నాయకులు, కార్యకర్తలు చర్చించారు. పెండింగ్ రోడ్లు, కాలువలు పూర్తి చేయాలని, సదాశివన్ కాలనీలో మట్టిరోడ్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేయగా, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని నాయకులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ధనుంజయయాదవ్, లింగమయ్య, ఈశ్వరయ్య, స్థానిక నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, బాబు, అలీ, జితేంద్ర, సంజయ్, రహంతుల్లా, బాబా పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకున్న ప్రజలు



స్థల పరిశీలన చేస్తున్న జేసీ కేతన్‌గార్గ్

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం చియ్యేడు వద్ద రోడ్డు మెటల్ – బిల్డింగ్ స్టోన్, ఎం.శ్యాండ్, కంకర గనుల ఏర్పాటుకు జేసీ కేతన్ గార్గ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణను గ్రామస్తులు అడ్డుకున్నారు. జేసీ మాట్లాడుతూ చియ్యేడు, మన్నీల, కృష్ణంరెడ్డిపల్లి గ్రామాల పరిధిలోని గనుల యజమానులు గతంలో ఇచ్చిన హామీలను పూర్తి చేశారా? లేదా? అని తెలుసుకునేందుకు కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కంకర మిషన్లలో ఇష్టారాజ్యంగా తవ్వలు జరుపుతున్నారని వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి మండిపడ్డారు. ఈ ప్రాంతంలో ఏడు మైనింగ్‌లకు అనుమతులిచ్చారన్నారు. హెవీ బ్లాస్టింగ్‌తో ఇళ్లు దెబ్బ తింటున్నాయన్నారు. ఇప్పుడు మరో మూడు మైనింగ్‌లకు అనుమతులు ఇవ్వకూడదని పట్టుబట్టారు. ప్రతి ప్లాంట్ తరపున 35 మందికి ఉపాధి కల్పిస్తామని ముగ్గురికి కూడా కల్పించలేదన్నారు.

టీఎఫ్‌టీ ఏర్పాటుకు స్థల పరిశీలన

అనంతపురం అర్బన్: నగర సమీపంలోని చిన్మయనగర్‌లో కల్లుగీత కార్మికులకు కొత్త టీఎఫ్‌టీ (టీ ఫర్ ట్యాపర్) ఏర్పాటుకు స్థలాన్ని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ మంగళవారం పరిశీలించారు. కొత్త టీఎఫ్‌టీ కోసం జె.రవికుమార్ అనే వ్యక్తి దరఖాస్తు చేసుకున్నాడు. ఈ వివరాలను పరిశీలించి ఎక్సైజ్ కమిషనరకు దరఖాస్తును ఎక్సైజ్ అధికారులు పంపడంతో అక్కడి నుంచి టీఎఫ్‌టీ ఏర్పాటుకు అనుమతి వచ్చింది దీంతో చిన్మయనగర్‌లో టీఎఫ్‌టీ ఏర్పాటుకు స్థలాన్ని జేసీ పరిశీలించారు.కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారి మధుసూదన్, సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్‌ఐ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

కామారుపల్లిలో పంటల పరిశీలన..

అనంతపురం రూరల్ మండలం కామారుపల్లిలో ఎండిపోయిన పంటలను జేసీ కేతన్ గార్గ్, డీఏఓ ఉమామహేశ్వరమ్మ మంగళవారం పరిశీలించారు. రైతు రామకృష్ణారెడ్డి పొలంలో ఎండిపోయిన ఆముదం, కంది పంటలను పరిశీలించారు. జేసీ మాట్లాడుతూ రైతులు తక్కువ నీరు, కాలపరిమితి, అధిక దిగుబడి ఇచ్చే జొన్న, సజ్జ, కొర్రలు, ఉలువలు సాగు చేసుకోవాలన్నారు. ఏడీఏ ఎం.రవి, అనంతపురం ఏఓ జె.శశికళ, వ్యవసాయ విస్తరణ అధికారి మురళీకృష్ణ, అలేఖ్య, ఏఈఓ మహేశ్వరి, నిర్మల, గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో అనంత చిన్నారుల ప్రతిభ



స్కేటింగ్‌లో సత్తా చాటిన చిన్నారులు

అనంతపురం: రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో అనంత చిన్నారులు ప్రతిభ సాధించారు. విశాఖపట్నంలో ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలు జరిగాయి. ఇందులో అనంతపురం చిన్నారులు ప్రతిభ చాటి పతకాలు దక్కించుకొని జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలు డిసెంబర్ 15 నుంచి 20వ తేదీ వరకు చెన్నైలో జరగనున్నాయి. ప్రజీత్ గోల్డ్‌మెడల్, ధన్విత్ –రెండు సిల్వర్, హజ్మా ఒక సిల్వర్, ధ్రుతి సిల్వర్, లేహత్ రెండు గోల్డ్‌మెడల్స్, కార్తిక్ మూడు గోల్డ్ మెడల్స్, లావిష్ ఒక బ్రాంజ్ మెడల్ సాధించారు. రోలర్ స్కేటింగ్ అకాడమీ అధ్యక్షుడు ప్రవీణ్‌బాబు, సిరాజ్, కోచ్‌లు నాగేంద్ర, అంజి, అనిల్, హేమంత్ అభినందించారు.

26 నుంచి రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు

ఈ నెల 26 నుంచి నగరంలోని కేఎస్ఎన్ డిగ్రీ, పీజీ కళాశాలలో రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు నిర్వహించనున్నారు. ఆల్ అనంతపురం చెస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బాలరాజు, అధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి ఉదయ్‌కుమార్ నాయుడు మంగళవారం తెలిపారు. 6 నుంచి 16 ఏళ్ల వయస్సు వరకూ కేటగిరిల వారీగా బాల, బాలికలకు పోటీలు ఉంటాయి. రాష్ట్ర వ్యాప్తంగా 150 మంది క్రీడాకారులు నమోదు చేసుకున్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 24లోపు apchesr.orgలో పేర్లు నమోదు చేసుకోవచ్చు.



మాట్లాడుతున్న జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి

నాలుగేళ్లలోనే పాతికేళ్ల అభివృద్ధి

ఆత్మకూరు: పాతికేళ్లుగా అధికారంలో ఉండి పరిటాల కుటుంబం చేయని అభివృద్ధిని..నాలుగేళ్లలో తోపుదుర్తి కుటుంబం చేసి చూపింది..నియోజకవర్గంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అభివృద్ధి చేయలేదని టీడీపీ నాయకులు విమర్శలు చేయడం తగదని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అన్నారు. ఇంత అభివృద్ధి జరిగినా టీడీపీ నాయకుల కళ్లకు కనిపించలేదా? అని ప్రశ్నించారు. మంగళవారం ఆత్మకూరులో వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు విలేకరులతో మాట్లాడారు. మండలంలో టీడీపీ నాయకులతో కలిసి పరిటాల సునీత 'బాబు షూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ' పేరుతో ఆత్మకూరు మండలంలో తిరుగున్నారని, ఇంత వరకూ ప్రజలు ఎలాంటి సమస్యలూ వారికి తెలియజేయలేదన్నారు. సీఎం జగనన్న, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పార్టీలకతీతంగా పథకాలు అందిస్తున్నారని తెలిపారు.

టీడీపీ డైరెక్షన్లో ఎల్లో మీడియాలో రాతలు..

నియోజకవర్గ వ్యాప్తంతో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎన్నో అభివృద్ధి పనులు చేశారని, మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో అంతర్గత రోడ్లు రూ.2 కోట్లతో నిర్మించారన్నారు. జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ కొళాయి కింద రూ.2.10 కోట్లతో పనులు జరుగుతున్నాయని తెలిపారు. బోర్లు వేసి, మోటార్లు , బోర్లు మరమ్మతులు చేయించి ట్యాంకుల ఏర్పాటుకు రూ.1.40 కోట్లు ఖర్చు చేశారన్నారు. వడ్డుపల్లి నుంచి మదిగుబ్బకు వెళ్లేందుకు అధ్వానంగా ఉన్న రోడ్డును టీడీపీ హయాంలో పట్టించుకోలేదని, ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి చొరవ తీసుకొని రూ.2.30 కోట్లతో జర్మన్ టెక్నాలజీతో రోడ్డు వేయిస్తున్నారన్నారు. 11 గ్రామ సచివాలయాలకు గాను రూ.4.80 కోట్లతో భవనాలు నిర్మించారన్నారు. గ్రామాల్లో 10 ఆర్‌బీకేల నిర్మాణానికి రూ. 1.77 కోట్లు వెచ్చించారన్నారు. మండలంలో 5 హెల్త్ సెంటర్లు రూ. 1.50 కోట్లతో అభివృద్ధి చేశారన్నారు. అనంతపురం నుంచి తగరకుంటకు రూ. 60 కోట్లతో రోడ్డు పనులు చేస్తున్నారన్నారు. తోపుదుర్తి రిజర్వాయర్ కోసం రూ.250 కోట్లతో భూ సేకరణ పనులు ప్రారంభం కాబోతున్నాయన్నారు. రూ.96 కోట్లతో నీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ హేమలత, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపోతన్న, వైస్ ఎంపీపీ విజయ్, సర్పంచులు నరసింహులు, ఓబులేష్, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, ఎలక్షన్ మండల ఇన్‌చార్జ్ ననప గోపాల్‌రెడ్డి, నాయకులు ఈశ్వరరెడ్డి, ఫణిరెడ్డి, కృష్ణానాయక్, భాస్కర్‌రెడ్డి,వన్నూరప్ప,ఓబీ టైలర్ వెంకటేష్, అశోక్, లక్ష్మీనారాయణరెడ్డి, శంకర్‌నాయక్, వెంకటేష్ పాల్గొన్నారు.

మాలధారులకు అన్నదానం



భిక్షలో పాల్గొన్న మాలధారులు

అనంతపురం కల్చరల్: 15 ఏళ్లుగా మాలధారులకు అన్నవసతి కల్పిస్తున్న అనంత అయ్యప్ప అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో 41 రోజుల పాటు సాగే భిక్ష మంగళవారం ప్రారంభించారు. స్థానిక చెరువుకట్టపై ఈనెల 21 నుంచి డిసెంబరు 31 వరకు అయ్యప్ప, భవానీ, గోవింద, హనుమంత మాలధారులకు 41 రోజుల పాటు అన్నవసతి ఉంటుంది. నిత్యం 1,500 మంది నుంచి 2వేల మంది వరకు భిక్ష అందిస్తామని అన్నదాన సేవాసమితి సభ్యులు తెలిపారు. అంతకు ముందు అయ్యప్ప స్వామి భజన, సామూహిక భక్తి గీతాలాపనలు జరిగాయి.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు

ఆత్మకూరు: కార్తీకమాసం సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళ వారం విశేష పూజలు, పంచామృతాభి షేకాలు నిర్వహించారు. స్వామికి పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. కార్తీకమాసం కావడంతో మహిళలు పెద్ద ఎత్తున పూజల్లో పాల్గొని, కార్తీక దీపాలను వెలిగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

అనంతకు చేరుకున్న పురుషోత్తమ భారతీస్వామీజీ



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

అనంతపురం కల్చరల్: శృంగేరి శివగంగ శారద మఠం జగద్గురు పురుషోత్తమ భారతీ స్వామీజీ మంగళవారం రాత్రి అనంతకు చేరుకున్నారు. స్వామీజీని వేదపండితులు నగరవీధుల్లో ఊరేగింపుగా తీసుకొచ్చారు. స్థానిక శారదానగర్‌లోని శంకర మఠం చేరుకున్న భారతీస్వామీజీకి వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామీజీ చంద్రమౌళీశ్వర పూజలు, శారదామాత పూజలనంతరం అనుగ్రహభాషణం చేశారు. భారతీ స్వామీజీ బుధవారం ఉదయం 10 గంటలకు మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండరామాలయానికి విచ్చేస్తారు.

గ్యాస్ లీక్ ఘటనలో చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



హేమంత్ (ఫైల్)

రాప్తాడు రూరల్: ఎల్‌పీజీ గ్యాస్ లీకేజీలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ హేమంత్ (11) మృతి చెందాడు. వివరాలు.. ఈ నెల 17న కక్కలపల్లిలో గ్యాస్ పేలుడు ప్రమాదంలో వెంకట్రాముడు, అతని భార్య భార్య రామాంజినమ్మ, తమ్ముడి కుమారుడు హేమంత్ తీవ్రంగా గాయపడ్డారు. అతి కష్టంపై క్షతగాత్రులను స్థానికులు బయటకు తీసుకొచ్చి, చికిత్స నిమిత్తం అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తీసుకెళ్లారు. ముగ్గురూ అక్కడే చికిత్స పొందుతుండగా, మంగళవారం తెల్లవారుజామున హేమంత్ మృతి చెందాడు. సాయంత్రం స్వగ్రామంలో హేమంత్ అంత్యక్రియలు జరిగాయి. కాగా, వెంకట్రాముడు దంపతులు కర్నూలులోని ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారు.